సాక్షి చిత్తూరు

మంగళవారం ၊ 10 ၊ జనవరి ၊ 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,060

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.71

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	29	15
తిరుపతి	29	16
తిరుమల	25	12
గూడూరు	29	18
నగరి	30	17

వినాయకుని వెండి విగ్రహం వితరణ



కాణిపాకం(యాదమరి): తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన అనిల్‌కుమార్ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి వెండి విగ్రహాన్ని వితరణ చేశారు.

- వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

19 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వార్షిక ఆదాయ అవసరాలు, బిల్లులపై ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు ప్రజల అభిప్రాయాలు సేకరించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉన్నతాధికారులు విశాఖపట్నం నుంచి జిల్లాలోని అన్ని ఈఈ కార్యాలయాల్లో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. ఇందులో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించి మంగళ, బుధవారాల్లో మాక్ టెస్టు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. అదేవిధంగా కార్యక్రమానికి సంబంధించిన ప్రచార బ్యానర్లను రద్దీ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉగాది నాటికి 25 వేల ఇళ్ల నిర్మాణాలు



వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ

సాక్షి, చిత్తూరు: ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఉగాది నాటికి 25 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని జేసీ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన సోమవారం హౌసింగ్ పీడీ పద్మనాభంతో కలిసి గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిర్ణయించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలు పోస్టుల భర్తీ




ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారి

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పలు పోస్టులను సోమవారం భర్తీ చేశారు. ఎన్‌హెచ్‌ఎం విభాగంలో స్టాఫ్ నర్సులు – 23, ల్యాబ్ టెక్నీషియన్‌- 2, అటెండర్‌- 1, కుక్ -1, చిన్న పిల్లల వైద్య నిపుణులు – 4, సెక్యూరిటీ గార్డులు – 5, సపోర్టింగ్ స్టాఫ్ – 3, డెబికల్ ఆఫీసర్స్‌- 14 పోస్టులకు సోమవారం జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. అధికారులు సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలకు రెండు, మూడు కౌంటర్లు ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. వివిధ పోస్టులకు గాను మొత్తం 1100 మందికి పైగా అభ్యర్థులు వచ్చారని అధికారులు పేర్కొన్నారు.

ఫోర్ వీలర్ సర్వీస్ అసిస్టెంట్ కోర్సులో శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న స్కిల్ హబ్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ అసిస్టెంట్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ శిక్షణకు 8వ తరగతి పూర్తి చేసిన వారు అర్హులన్నారు. శిక్షణ పొందే అభ్యర్థులకు స్కిల్ ఇండియా సర్టిఫికేషన్, బస్‌పాస్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు 97034 37472, 91609 40479లో సంప్రదించాలని కోరారు.

శభాష్ విద్యార్థులూ..!



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్రలేఖనం పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులను డీఈఓ విజయేంద్రరావు సోమవారం అభినందించారు. జిల్లా బాలభవన్ ఆధ్వర్యంలో 2022లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో పలువురు విద్యార్థులు చిత్రలేఖనంలో శిక్షణ పొందారు. వారు గీసిన చిత్రాలను అమలాపురంలోని కోనసీమ చిత్ర కళాపరిషత్‌కు పంపారు. వాటిలో మంచి చిత్రాలను ఎంపిక చేసి బంగారు, వెండి పతకాలు అందజేశారు. చిత్తూరు నగరంలోని గిరింపేట మున్సిపల్ పాఠశాలకు చెందిన భరత్, రఫి, కణ్ణన్ పాఠశాలకు చెందిన భవ్య, వంశీ, లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన కళ్యాణి, పీసీఆర్ పాఠశాలకు చెందిన జయశ్రీ, శ్రీశైలు బంగారు పతకాలు సాధించారు. అలాగే పీసీఆర్ పాఠశాలకు చెందిన చారులత, చైతన్య పాఠశాలకు చెందిన నరసింహా వెండి పతకాలు పొందారు. వారిని డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంఈఓ సెల్వరాజ్, బాలభవన్ చిత్రలేఖన శిక్షకులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాక్షస కాండ!



14 ఏళ్ల అధికార మదంతో టీడీపీ నేతలు పేట్రేగిపోయారు. అవసరాలను అవకాశంగా చేసుకుని ప్రజలను ముప్పుతిప్పలకు గురిచేశారు. ఇప్పుడు వీటన్నింటికీ చెక్ పడడంతో ఏమిచేయాలో దిక్కుతోచక వికృతచేష్టలకు పాల్పడుతున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పల్లెబాటను అడ్డుకునేందుకు అడుగడుగునా కుట్రలు పన్నుతున్నారు. తమ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందనే భయంతో పచ్చని పల్లెల్లో నిప్పురాజేసి రాక్షస క్రీడకు ఆజ్యం పోస్తున్నారు. అభిమానంతో ఏర్పాటు చేసుకున్న బ్యానర్లు, ఫ్లెక్సీలను చించివేస్తూ అరాచకాలు సృష్టిస్తున్నారు. అడ్డుకున్న కార్యకర్తలు, ప్రజలపై పిడిగుద్దులు కురిపిస్తున్నారు. హాకీ స్టిక్‌లు, రాళ్లతో దాడులు చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీనిపై పుంగనూరు నియోజకవర్గ ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- పుంగనూరులో తారస్థాయికి చేరిన టీడీపీ ఆగడాలు
- ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో చిచ్చురేపుతున్న తమ్ముళ్లు
- మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుటుంబమే లక్ష్యంగా దాడులు
- పల్లెబాట అడ్డుకునేందుకు అడుగడుగునా కుట్రలు
- విస్తుపోతున్న నియోజకవర్గ ప్రజలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు అలజడి సృష్టిస్తున్నారు. ఆ నియోజకవర్గంలో తమ పార్టీ తుడిచిపెట్టుకుపోతోందన్న అక్కసుతో దాడులకు తెగబడుతున్నారు. ఏంచేయాలో దిక్కుతోచక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలు చించివేస్తూ రాక్షసానందం పొందుతున్నారు. అడ్డుకుంటున్న కార్యకర్తలు, ప్రజలపై విచక్షణారహితంగా దాడులు చేస్తూ రచ్చకీడుస్తున్నారు. తర్వాత వాటన్నింటినీ ప్రభుత్వం, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపైకి నెట్టి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమకు అనుకూలమైన పత్రికలు, మీడియాలో అసత్య కథనాలు వళ్లిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారు.



చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత రాజారెడ్డిని పరామర్శిస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి (ఫైల్)

దాడులు ఎందుకంటే..

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వెనుకబడిన ప్రాంతాల్లో పుంగనూరు నియోజకవర్గం కూడా ఉంది. 14 ఏళ్ల టీడీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కింది. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లు తదితర వాటిని టీడీపీ కార్యకర్తకో, వారి కుటుంబ సభ్యులకో మంజూరు చేయడం రివాజుగా మారేది. లేదంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిప్పడం.. ఆపై మొండిచేయి చూపడం అటవాటుగా మారింది. ఆ పార్టీ నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలకే రోడ్లు, ఇతర పథకాలు మంజూరయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితిలేదు. 2019 సాధారణ ఎన్నికల తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా రాష్ట్రమంతా సంక్షేమ పాలన మొదలైంది. ఈ నేపథ్యంలోనే సీఎం వైఎస్ జగన్ పాలనకు మెచ్చి పుంగనూరు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్నారు. ఆయన అనేక మందికి తనవంతు సాయం చేస్తుండడంతో ఆ నియోజకవర్గ పరిధిలో టీడీపీకి అనుకూలంగా ఉన్న గ్రామాలు సైతం వైఎస్సార్‌సీపీ జెండా కిందకు వస్తున్నాయి. ప్రస్తుతం పల్లెబాట పేరుతో ఊరూరా తిరుగుతున్న మంత్రికి అనూహ్య స్పందన లభిస్తుండడంతో.. నియోజకవర్గంలో అక్కడక్కడా మిగిలిపోయిన టీడీపీ నేతలు సైతం వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకుంటున్నారు. మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ మూకలు దాడులకు తెగబడుతున్నాయి.

రెచ్చిపోతున్న తమ్ముళ్లు

మంత్రి పెద్దిరెడ్డి పల్లెబాట నేపథ్యంలో రొంపిచర్ల మండలంలోని బొమ్మయ్యగారిపల్లె, పెద్దగొట్టిగల్లు, బోడిపాటివారిపల్లెకు చెందిన టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. దీన్ని జీర్ణించుకోలేక టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డారు. రెండు రోజుల క్రితం రొంపిచెర్ల క్రాస్‌లో వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలను చించివేశారు. అలాగే ఈనెల 1వ తేదీ రాత్రి చౌడేపల్లి మండలం, గడ్డంవారిపల్లె పంచాయతీ, తెల్లనీళ్లపల్లిలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి (చిట్టి), అతని అనుచరులు కలిసి ఎంపీటీసీ శ్రీరాములును చితకబాదారు. ఆ గ్రామంలో బ్యానర్లు కట్టకూడదని దౌర్జన్యానికి ఒడిగట్టారు. అదేవిధంగా ఈనెల 3న దిగువపల్లె పంచాయతీ భవానీనగర్‌లో భూ విషయమై టీడీపీ వర్గాలు రెండు ఘర్షణకు దిగాయి. దీన్ని వైఎస్సార్‌సీపీకి అంటగడుతూ ఎల్లో మీడియా ద్వారా అసత్య కథనాలు రాయించడం కొసమెరుపు.



దాడులకు ఎగబడుతున్న టీడీపీ శ్రేణులు (ఫైల్)

బరితెగిస్తూ.. నియోజకవర్గంలో 'చల్లా'యిస్తూ..

ఇటీవల టీడీపీ నియోజకవర్గ నేత చల్లా బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు 'ఇందేం ఖర్మ' కార్యక్రమాన్ని చేపట్టారు. గత శుక్రవారం పీలేరు, కలికిరి నుంచి ర్యాలీగా సోమల మండలానికి చేరుకున్నారు. పెద్ద ఉప్పరపల్లి మీదుగా సోమల దళితవాడకు చేరుకున్న టీడీపీ ర్యాలీని స్థానికులు అడ్డుకున్నారు. 'టీడీపీ ప్రభుత్వంలో మాకేం చేశారు..' అంటూ ఎదురుతిరిగారు. తమ గ్రామంపై ర్యాలీ చేయడానికి వీల్లేదంటూ రోడ్డుపై బైఠాయించారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని టీడీపీ శ్రేణులు వికృతచేష్టలకు ఒడిగట్టారు. అడ్డు తప్పుకోకపోతే వాహనాలతో తొక్కిస్తామంటూ బెదిరింపులకు దిగారు. ఈ నేపథ్యంలోనే స్థానికులకు, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సహించలేని టీడీపీ శ్రేణులు స్థానికులపై హాకీ స్టిక్స్, రాళ్లతో దాడికి దిగారు. వీరి గొడవను ఆపేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పీఎల్‌ఆర్ రాజారెడ్డిపై దాడిచేశారు. ఆయన కాలు, చేయిని విరగ్గొట్టి పంతం నెగ్గించుకున్నారు. చివరకు సోమల ఎస్‌ఐ లక్ష్మీకాంత్ పైనా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

విశేష స్పందన

- వివిధ సమస్యలపై 177 వినతులు
- స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం
- అలసత్వం వహిస్తే చర్యలు
- కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్: స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జేసీ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్‌వో రాజశేఖర్‌తో కలిసి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి 177 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు 73, విద్యాశాఖకు 5, వైద్య, ఆరోగ్య శాఖకు 2, పశు సంవర్ధక శాఖకు 2, హౌసింగ్ శాఖకు 10, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయానికి 2, సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు 1, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు 1, పోలీసు శాఖకు 1, ఇతరులు 9, ఆన్‌లైన్‌లో నమోదు కానివి 71 అర్జీలు వచ్చాయని తెలిపారు.

- పెనుమూరు మండలం కలిగిరి పంచాయతీ ఓబయ్యగారిపల్లిలో టీడీపీ నేతల భూదందా పెచ్చుమీరిందని జయచంద్రనాయుడు, మేఘనాథనాయుడు, సురేంద్రబాబు, జయరామనాయుడు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఓబయ్యగారిపల్లిలో ఉండే టీడీపీ నాయకులు కంద్ర లక్ష్మీపతి నాయుడు, కంద్ర హేమాచలపతి నాయుడు, మాజీ సర్పంచ్ ఆనందనాయుడు గ్రామానికి చెందిన 12 కుటుంబాల ఆస్తులను వారి పేరు మీద అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని పాసుపుస్తకాలు తీసుకున్నారని తెలిపారు. ఆనందనాయుడు ప్రభుత్వ పాఠశాల మైదానం భూమిని భార్య పేరుతో పట్టా చేసుకున్నారని తెలిపారు.




వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్ తదితరులు

- బీసీ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నేతలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. 430 వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. సోలార్ సిస్టం, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేయాలన్నారు. ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గురుగణేష్, బీజే పీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, రామ్మూర్తి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.
- జగనన్న క్లాప్ మిత్రల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య కోరారు. స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం స్పందనలో వినతి పత్రం అందజేశారు.

'స్పందన' విన్నపాలు వినవలె..!

చిత్తూరు అర్బన్: స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. చిత్తూరు ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన స్పందనలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. 14 అర్జీలు రాగా కుటుంబ తగదాలు 2, వేధింపులు 2, ఆస్తి తగాదాలు 9, పోలీస్ సర్వీసెస్ 1 చొప్పున ఇందులో ఉన్నాయి. వాటిని పరిశీలించి బాధితులను న్యాయం చేయాలని ఆయన ఆదేశించారు. ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు

ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకం

సదుం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రజాసంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్లు అయిన సందర్భంగా సదుంలో సోమవారం నేతాజీ, దివంగత నేత వైఎస్‌ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 341 రోజులు 3,648 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకున్నారని తెలిపారు. వాటిని మేనిఫెస్టోలో చేర్చి నవరత్నాల పథకాలుగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీ టీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ యల్లప్ప, వల్లివేడు పృథ్వీరెడ్డి, సర్పంచ్ ఉషారాణి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, మాజీ సర్పంచ్ సయ్యద్‌బాషా, ఇమ్రాన్, ఇందాద్ పాల్గొన్నారు.



వైఎస్సార్, నేతాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

జగనన్నది గొప్ప విజన్

నగరి: సచివాలయ వ్యవస్థను దేశవ్యాప్తంగా తీసుకురావాలని చూస్తుండడం సీఎం వైఎస్ జగనన్న గొప్ప విజన్‌కి నిదర్శనమని పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం విజయపురం మండలం, కాళికాపురం గ్రామంలో కేక్‌కట్ చేసి శ్రేణులకు పంచిపెట్టారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకుని మేనిఫెస్టోని సిద్ధం చేయడమే కాకుండా వందశాతం హామీలు పూర్తిచేసిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఎండలో తిరగకుండా దొంగలు దూరే సమయానికి పాదయాత్ర చేసి తను ఇచ్చిన మేనిఫెస్టోలో ఒక్కటి కూడా సక్రమంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ కలిసికట్టుగా వచ్చినా జగనన్న వేలుని కూడా కదిలించలేరని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రోజా

మీ ఇద్దరిలో సీఎం అభ్యర్థి ఎవరు?

- చంద్రబాబు, పవన్‌కు ఎంపీ మిథున్ రెడ్డి సూటి ప్రశ్న
- రాజకీయం అంటే సినిమా కాదు
- పవన్‌షోతో బాబుకు ఓట్లు వేయరు

పుంగనూరు: చంద్రబాబు.. పవన్‌కల్యాణ్.. ఇద్దరిలో ఎవరు సీఎం అభ్యర్థి అనేది ప్రజలకు స్పష్టం చేయాలని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం పుంగనూరు మున్సిపాలిటీలో ఎంపీ రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ రెడ్డెప్పతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం అభ్యర్థిగా చెప్పుకునే జనసేన నాయకుడు పవన్ కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబుతో జతకట్టడం సిద్ధాంతాలు లేకపోవడమేనన్నారు. స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు ఎత్తుగడలు, పవన్‌కల్యాణ్ అభిమానులను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయన్నారు. పవన్ కల్యాణ్ షోలతో చంద్రబాబుకు జనం ఓట్లు వేయరన్నారు. రాజకీయం సినిమా కాదని.. కాపుల ఓట్ల కోసం చంద్రబాబు వల విసురుతున్నారని చెప్పారు. 2019లో వారిద్దరూ జతకట్టి, కాపుల ఓట్ల కోసం డ్రామాలాడి అభ్యర్థులను నిలబెట్టారని ఎంపీ ఆరోపించారు. రాష్ట్రంలో బాబు, ఆయన దత్త పుత్రుడు ఒక్కటైనా వారికి ఓట్లు పడవని, వారికి తగిన గుణపాఠం నేర్పుతారని స్పష్టంచేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని వారు ఆర్భాటాలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించడమేనన్నారు. చంద్రబాబునాయుడు సభలు, ర్యాలీల్లో అమాయకులను బలిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కుప్పం సభకు ఆయన అనుమతి తీసుకోకపోవడం చట్టాన్ని అతిక్రమించడమేనన్నారు. చట్టాన్ని గౌరవించలేని వారు సమాజాన్ని ఏవిధంగా పాలిస్తారని నిలదీశారు. సభలు, రోడ్ షోల నిర్వహణపై ఇచ్చిన జీవోను వాళ్లిదరూ చదవాలని సూచించారు. చిరంజీవి, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ కూడా సినిమా ఈవెంట్లు అనుమతి పొంది నిర్వహించారని తెలియజేశారు. కుప్పంలో చంద్రబాబు నకిలీ పేషెంట్లకు ఆస్పత్రిలో చికిత్సలు చేయించి షో చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు గుర్తించి ఓట్లు వేయమని కోరుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి

ఇంట్లో చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు దుర్గానగర్ కాలనీలోని బాలమురళి ఇంట్లో దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. 42 గ్రాముల బంగారు, వంద గ్రాముల వెండి ఆభరణాలు చోరీ చేశారు.

హామీలు వంద శాతం అమలు

- వైఎస్సార్ సీపీ హామీలపై ప్రజలకు నమ్మకం
- మళ్లీ జగనే సీఎం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

సదుం: అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం సదుం మండలంలో పల్లెబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నికల వచ్చే సమయంలోనే సంక్షేమ పథకాలు అమలుచేసేవన్నారు. ఎన్నికలలోపు హామీలను వంద శాతం అమలు చేసే పరిస్థితి తీసుకువచ్చింది సీఎం జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని, వైఎస్సార్ సీపీ హామీ ఇస్తే కచ్చితంగా అమలుచేస్తుందని బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు మేనిఫెస్టోలోని హామీలు ఏ మాత్రం అమలయ్యాయో అందరికీ తెలుసన్నారు. ప్రతిపక్షాలు తమ ఉనికి కోసం పడరాని పాట్లు పడుతున్నాయని విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీకి ఘన విజయం కట్టబెట్టనున్నారని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ యల్లప్ప, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం కార్వేటినగరంలో వైఎస్సార్ విగ్రహానికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కష్టాలు తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారం కోసం ఏమి చేయాలో తెలుసుకోవడంతోపాటు రాక్షస పాలనకు చరమగీతం పలికేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి, సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలు చేశారని కొనియాడారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులతో మంత్రి పెద్దిరెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

సదుం/గుడుపల్లె: సదుం, గుడుపల్లె మండలాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సదుం మండలంలోని గూబలవారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు రాజేంద్ర, తులసీ, రఘు, నరేష్ తదితరులు సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా గుడుపల్లె మండలం యామగానిపల్లె టీడీపీ మాజీ ఎంపీటీసీ సరోజమ్మ, కుప్పిగానిపల్లెకు చెందిన 50 కుటుంబాల వారు ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గుడుపల్లెలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణమూర్తి, సర్పంచ్ శ్రీనివాసులు, సింగిల్‌విండో చైర్మన్ పత్రాల మునిరత్నం, నాగభూషణం, నియోజకవర్గ యూత్ రవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై మక్కువ పెరగాలి



జాతీయ స్మారక పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

పలమనేరు: నేటి తరం విద్యార్థుల్లో తెలుగు భాషపై మక్కువ తగ్గుతోందని, ఇది భవిష్యత్తుకు మంచిది కాదని ప్రముఖ శతావధాని ఆముదాల మురళి తెలిపారు. పలమనేరు సమీపంలోని కళామందిరంలో సోమవారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు ఆధ్వర్యంలో జాతీయ స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, కళలు, సంస్కృతిని కాపాడుకునేందుకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి లాంటి సంస్థలు గట్టిగా కృషిచేయాలని సూచించారు. అనంతరం ప్రముఖ కథా రచయిత పేరూరు బాల సుబ్రమణ్యంకు పైనేని చిన్నబుచ్చినాయుడు జాతీయ స్మారక పురస్కారం, కొలమాసనపల్లికి చెందిన తర్నారెడ్డి, గంగిరెడ్డి దంపతులకు నాగమణెమ్మ పురస్కారం, శ్రీపురం సీతారామయ్యకు సేగు సుభద్రమ్మ పురస్కారం, ఆముదాల మురళికి బసయ్య పురస్కారం, నాగ శివప్రసాద్‌కు రాజన్న పురస్కారం, భాగవతారిణి జయశ్రీకి దండపల్లి క్రిష్ణప్ప పురస్కారం అందజేశారు. సంఘం కార్యదర్శి పుష్ప, ఎల్లంపల్లి నరేంద్ర, చంద్రశేఖరయ్య, గురుమూర్తి, నరసింహులు శెట్టి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్



కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జనార్దన్‌రావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులతో ఆశీర్వచనం ఇప్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని వెండి విగ్రహం వితరణ



వినాయక స్వామి వెండి విగ్రహాన్ని అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన అనిల్‌కుమార్ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి వెండి విగ్రహాన్ని వితరణ చేశారు. ఆయన సోమవారం కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనం కోసం ఆలయం వద్దకు వచ్చారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి సుమారు కిలో వెండితో (సుమారు రూ.80 వేలు) తయారు చేసిన వినాయకుని విగ్రహాన్ని అందజేశారు. వారికి అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి వేదపండితుల ఆశీర్వచనం అందించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన యువతి మృతి

చిత్తూరు అర్బన్: ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువతి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. టూటౌన్ ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన రమ్య (21) తల్లిదండ్రులు మృతి చెందడంతో అవ్వ వద్ద ఉంటోంది. ఆమె నర్సింగ్ చేసింది. పలువురి వద్ద అప్పులు తీసుకుంది. డబ్బు తిరిగి చెల్లించాలని వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో ఈ నెల 4వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చిన్నకనంలో టిప్పర్ బోల్తా



కార్వేటినగరం: మండల కేంద్రమైన కార్వేటినగరం సమీపంలోని చిన్నకనంలో సోమవారం టిప్పర్ బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు.. టిప్పర్ ముగ్గుపిండి లోడుతో పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం మీదుగా తమిళనాడుకు వెళుతోంది. డ్రైవర్ వేగంగా వస్తూ చిన్నకనంలో మలుపుని గుర్తించకపోవడంతో టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. రోడ్డును ఆనుకుని 33 కేవీ విద్యుత్ స్తంభం ఉంది. టిప్పర్ దానికి తగిలి ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. గత నెలలో అదే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆర్‌అండ్‌బీ అధికారులు సందర్శించి సేఫ్టీ వాల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


బాలుడి ఆత్మహత్య



మృతి చెందిన హేమచెందు

బంగారుపాళెం: మండలంలోని సదకుప్పంలో సోమవారం సాయంత్రం బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సురేష్ కుమారుడు హేమచెందు (14)కు గ్యాస్ సిలిండర్ తీసిపెట్టాలని రూ.2 వేలు ఇచ్చి కూలి పనులకు వెళ్లాడు. హేమచందు మిత్రులతో ఆడుకుంటూ నగదు పోగొట్టాడు. తల్లిదండ్రులు ఏమంటారోనని భయపడి ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరిశీలించి బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడు అరగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహారెడ్డి తెలిపారు.

వలంటీర్..



శరవణ (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం, 11వ డివిజన్ వలంటీర్ శరవణ (32) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురి వద్ద నగదు అప్పు తీసుకొచ్చి తెలిసిన వాళ్లకు ఇచ్చానని, వారు మోసం చేయడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో తెలిపాడు. ఆ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తన స్నేహితులకు చనిపోతున్నట్లు మెసేజ్ పెట్టిన శరవణ జోగులకాలనీ వద్ద ఉన్న తన ఇంటి ఆవరణలోని వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. శరవణ మృతికి కారణమైన షేక్ సయ్యద్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ నరసింహరాజు తెలిపారు.

భూకబ్జా కేసులో నిందితునికి జైలు

తడ: భూమిని కబ్జాచేసి బాధితులను భయభ్రాంతులకు గురిచేసిన కేసులో నిందితుడికి సూళ్లూరుపేట కోర్టు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధించింది. 2014లో బద్దెపూడి సులోచనమ్మ అనే మహిళ తడ పోలీస్ స్టేషన్‌లో తడకు చెందిన కండ్రిగ ప్రసాద్ అనే వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి కోర్టుకు నివేదిక అందజేశారు. ఇరువర్గాల వాదనలు విన్న సూళ్లూరుపేట ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్ సోమవారం తుది తీర్పు వెలువరించారు.

నిత్యాన్నదానానికి రూ.1.50 లక్షల విరాళం



కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కృష్ణమోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం రూ.1.50 లక్షల విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణికి అందజేశారు. వారికి అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు



జిల్లా రెజ్లింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

వడమాలపేట : రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం భువనేశ్వరి తెలిపారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా అండర్ 17 రెజ్లింగ్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. అందులో వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఫ్రీ స్టైల్ విభాగంలో మన్సూర్ ఆలం (60 కేజీలు), చరణ్ కుమార్ (65 కేజీలు), ఉదయ్ కుమార్ (71 కేజీలు), మనోజ్ (80 కేజీలు) ఎంపికయ్యారని చెప్పారు. గ్రీగో రోమన్ విభాగంలో జై సూర్య (45 కేజీలు), యూనస్ (55 కేజీలు), జయ కుమార్ (60 కేజీలు), దర్శన్ (71 కేజీలు) ఎంపికయ్యారని తెలిపారు. వీరు జనవరి 12, 13వ తేదీల్లో అనంతపురం జిల్లా దిమ్మగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.